సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 5 । జనవరి । 2023

ఈవీఎం గోదాం తనిఖీ



నెల్లిమర్ల: పట్టణంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఎ.సూర్యకుమారి బుధవారం తనిఖీచేశారు. గోదాంకు వేసిన తాళాలు, సీళ్లను, రికార్డులను పరిశీలించారు. ఈవీఎంలకు పటిష్ట భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట డీఆర్ఓ ఎం.గణపతిరావు, తహసీల్దార్ కేవీ రమణరాజు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మహేష్ ఉన్నారు.



ఘనంగా పెదపోలమాంబ అనుపోత్సవం

శంబర పోలమాంబ మేనత్తైన పెద్దపోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. - 8లో

వచ్చేనెల 11న జాతీయ లోక్ అదాలత్

పార్వతీపురం: జిల్లా కోర్టులో ఫిబ్రవరి 11న జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తామని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల కక్షిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని పేర్కొన్నారు. కేసుల పరిష్కారానికి రాజీమార్గమే ఉత్తమమార్గమని, డబ్బు, సమయం ఆదా చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

శంబర పోలమాంబ జాతరకు ఆహ్వానం



కలెక్టర్‌కు శంబర పోలమాంబ జాతర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

పార్వతీపురం: శంబర పోలమాంబ జాతరకు ఆహ్వానిస్తూ దేవదాయశాఖ సిబ్బంది కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు బుధవారం ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ ఉద్యోగి సుధారాణి మాట్లాడుతూ శంబర పోలమాంబ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. జాతరను విజయవంతం చేయాలని అన్నివర్గాల వారిని కోరారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్రోద్యమంలో ఆదివాసీలది కీలకపాత్ర



సదస్సులో మాట్లాడుతున్న వరహాల దొర

గుమ్మలక్ష్మీపురం: భారతదేశ స్వాతంత్య్రోద్యమంలో ఆదివాసీలు కీలక పాత్రపోషించారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ ఆర్.ఎస్.వరహాలదొర అన్నారు. ట్రైబల్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎస్టీ)లో 'భారతదేశ స్వాంత్రోద్యమంలో ఆదివాసీల పాత్ర' అనే అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆదివాసీలైన గంటం దొర, గంటం మల్లుదొర, కొమరం భీమ్, బీర్సాముండా, బోనండి పండుపడాల్ వంటి వారు స్వాతంత్య్ర సాధనలో అసువులు బాసారన్నారు. ఆదివాసీ సమాజం ఆదివాసీ వీరుల త్యాగాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్విన్‌పేట ఎస్‌ఐ ఎస్.షన్ముఖరావు మాట్లాడుతూ ఆదివాసీలు నిస్వార్థంగా స్వాతంత్య్రం కోసం పోరాటం చేసినప్పటికీ గుర్తింపులేకపోవడం బాధాకరమని, ఆదివాసీ పోరాట యోధుల జీవితాల నుంచి స్ఫూర్తిని పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రైబల్‌రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, ఆదివాసీ సంఘాల నాయకులు ఎన్.కృష్ణబాబు, టి.లోకనాథం, బి.దామోదర్, జి.గవరన్నదొర, రవికుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న అహోబిలం జియర్ స్వామి

కొత్తవలస రూరల్: మంగళపాలెం గురుదేవా చారిటబుల్ ట్రస్టు 20 మంది దివ్యాంగులకు బుధవారం కృత్రిమ అవయవాలను పంపిణీ చేసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అహోబిలం జియర్ స్వామి హాజరయ్యారు. ఆయన ముందుగా గురుదేవా చారిటబుల్ ట్రస్టు, ఆస్పత్రిని సందర్శించారు. అనంతరం కృత్రిమ అవయవాలతో పాటు 100 మంది వృద్ధులకు రేషన్ సరుకులు అందజేశారు. 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్, ట్రస్టు హాస్పిటల్ వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

11న డీఆర్సీ సమావేశం

విజయనగరం అర్బన్: జిల్లా అభివృద్ధి మండలి సమీక్ష సమావేశం ఈ నెల 11న జరగనుందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయం, ధాన్యం కొనుగోలు, పశుసంవర్ధక శాఖ సేవలు, గృహనిర్మాణం, వైద్యారోగ్యం, మహిళాశిశు సంక్షేమం, ఉపాధి హామీ-కన్వర్జెన్స్, జలవనరులు, తాగునీటి సరఫరా, విద్యాశాఖ, సమగ్ర శిక్ష, సంక్షేమ పథకాలు-డీఆర్‌డీఏ, గడపగడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై సమీక్ష జరుగుతుందని వెల్లడించారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజినల్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వాస్పత్రిలో వార్డు క్లీనర్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, సెక్యూరిటీ గార్డు పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఒక చోటకు చేరిన రాయల్ బెంగాల్ టైగర్లు
- నాలుగైదు కిలోమీటర్ల పరిధిలోనే నాలుగు రోజులుగా సంచారం
- మెంటాడ, బొండపల్లి, అనంతగిరి మండలాల సరిహద్దులో తిష్ట
- జతకట్టే అవకాశం ఉందని అటవీ అధికారుల అంచనా
- కలయిక సఫలమైతే మూడున్నర నెలల్లోనే సంతానోత్పత్తి
- ఒక కాన్పులో 2 లేదా 3 పిల్లలకు జన్మనిచ్చే అవకాశం



జిల్లాలో అటవీ అధికారులు అమర్చిన ట్రాకింగ్ కెమెరాకు చిక్కిన రాయల్ బెంగాల్ టైగర్ చిత్రం

జత కట్టాయి..!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రాయల్ బెంగాల్ టైగర్లలో ఒకటి ఆడది.. మరొకటి మగది. చెరో వైపు సంచరిస్తూ ఎనిమిది నెలలుగా ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలను హడలెత్తిస్తున్నాయి. కళ్లాల వద్ద ఆవులు, దూడలను హతమార్చుతూ ఆకలి తీర్చుకుంటున్నాయి. ఇప్పుడా రెండూ ఒక ప్రాంతానికి చేరాయి. అదీ నాలుగైదు కిలోమీటర్ల పరిధిలోకి వచ్చేశాయి. నాలుగు రోజులుగా ఎక్కడా పశువులపై దాడుల్లేవు. అదీగాక ఇది పులులు జతకట్టే కాలం కూడా! ఈ పరిస్థితుల ను బట్టి అవి సంభోగించే అవకాశం ఉందని అటవీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అది సఫలమైతే మూడున్నర నెలల కాలంలోనే రెండు లేదా మూడు పిల్లలకు జన్మనిస్తాయి. ప్రపంచంలో అత్యంత వేగంగా అంతరించిపోతున్న స్థితిలో ఉన్న ప్రాణు ల్లో రాయల్ బెంగాల్‌టైగర్లు కూడా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో రెండు మూడు పులిపిల్లలు జన్మిస్తే ఉమ్మడి విజయనగరం జిల్లాలో విశేషమే మరి!

ఉమ్మడి విజయనగరం జిల్లాలో గత మూడు దశాబ్దాల్లో ఎప్పుడూ పెద్దపులి సంచరించిన దాఖలాలు లేవు. అయితే, గత ఏడాది ఏప్రిల్ నెలలో తొలిసారిగా రాయల్ బెంగాల్ టైగర్ జిల్లాలో కనిపించింది. అదే సమయంలో పొరుగున అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో కూడా పులిదాడులు జరిగాయి. తర్వాత విజయనగరం జిల్లాలో కదలికలను బట్టి రెండు పులులు ఉన్నాయని అటవీశాఖ అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. ఒడిశాలోని అడవుల నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా విజయనగరం జిల్లాలోకి అడుగుపెట్టి ఉంటాయని భావిస్తున్నారు.



ప్రస్తుతం రెండు పులులు సంచరిస్తున్న ప్రాంతం

'తోడు'ను వెతుక్కుంటూ...

రాయల్ బెంగాల్ టైగర్లు మన రాష్ట్రంలోని నల్లమల అటవీ ప్రాంతంలోనే ఎక్కువగా ఉన్నాయి. విశాలమైన శ్రీశైలం అభయారణ్యంలో ఒక్కో పులి 30 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో సంచరిస్తుంటాయి. ఆ ప్రాంతాన్ని తన రాజ్యంగా భావిస్తుంటాయి. ఆ సరిహద్దు చుట్టూ మలం, మూత్రం విసర్జిస్తుంటాయి. చెట్లకు గోళ్లతో రక్కి గుర్తులు ఏర్పాటు చేస్తుంటాయి. మూత్రం కూడా ఎక్కువ రోజుల పాటు ఘాటు వాసన వస్తుంది. దాన్ని బట్టి మరో పులి ఆ పరిధిలోకి పోదు. అయితే ప్రకృతి ధర్మం ప్రకారం పునరుత్పత్తి కోసం ఆడపులితో జతకట్టడానికి ఆ గుర్తులే ఉపయోగపడుతుంటాయి. సాధారణంగా పులుల్లో ఆగస్టు, సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ వాటి సంభోగ సమయం (మేటింగ్ సీజన్) ఉంటుంది. నాలుగేళ్ల వయసు వచ్చిన తర్వాత నుంచి తోడు కోసం వెతుకుతూ వెళ్తుంటాయి.

ప్రస్తుతం అక్కడే కాపురం...

పులి తొలుత కనిపించిన ఆంధ్ర ఫారెస్టు ఏరియా ఒడిశా సరిహద్దుకు సమీపంలోనే ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి మండలానికి సరిహద్దు ప్రాంతమే అదంతా. తర్వాత అరకు అటవీ ప్రాంతం దాటితే ఒడిశా సరిహద్దు ఉంది. తాటిపూడి, ఆంధ్ర జలాశయాల చుట్టూ విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలోనే గత ఎనిమిది నెలల్లో ఎక్కువ సార్లు పెద్దపులి సంచారం కనిపించింది. ప్రస్తుతం రెండు పులులు గత నాలుగు రోజులుగా అనంతగిరి మండల సరిహద్దు గ్రామాలైన మూలపాడు, గూడెం, బొండపల్లి మండలంలోని పాత పనసలపాడు, మెంటాడ మండలంలోని పణుకువానివలస గ్రామాల పరిసరాల్లోనే ఉన్నాయి. ఆ ప్రాంతమంతా నాలుగైదు కిలోమీటర్ల విస్తీర్ణంలోనే ఉంది. అక్కడే రెండు పులులు ఏకమయ్యే అవకాశం ఉందని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. గర్భధారణ జరిగితే వంద నుంచి 110 రోజుల్లోనే పిల్లలకు జన్మనిస్తాయి.

కొత్త సంవత్సరంలో ప్రశాంతం...

డిసెంబర్ ఆఖరి వారంలో అనంతగిరి మండలంలో ఆవుపై దాడి చేసిన తర్వాత కొత్త సంవత్సరంలో ఎక్కడా పశువులపై దాడులు జరగలేదు. కొత్తవలస అటవీ ప్రాంతంలో ఎక్కువ సంచరించింది మగపులి అని, మెరకముడిదాం, బాడంగి, బొబ్బిలి ప్రాంతాల్లో ఎక్కువగా తిరిగింది ఆడపులి అని కెమెరాలకు చిక్కిన చిత్రాలను బట్టి అటవీ అధికారులు చెబుతున్నారు. మగ పులి కన్నా ఆడపులే ఎక్కువగా పశువులను హతమార్చింది. ఇప్పటివరకూ 42 పశువులను చంపి తినేసింది. పశువులను నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం రూ.7.42 లక్షలను పరిహారంగా అందజేసింది.

ఏకమయ్యే అవకాశం ఉంది



ఇప్పటివరకూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సంచరించిన రెండు పులులు ఇప్పుడు ఒకే ప్రాంతానికి చేరాయి. నాలుగైదు కిలోమీటర్ల దూరంలోనే ఉంటున్నాయి. ఇది వాటి సంభోగ కాలం (మ్యాటింగ్ సీజన్) కాబట్టి ఏకమయ్యే అవకాశం ఉంది. – శంబంగి వెంకటేష్, జిల్లా అటవీ అధికారి, విజయనగరం

ఓటర్ల జాబితా తయారీలో బీఎల్ఓలదే కీలకపాత్ర



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎన్నికల రోల్ అబ్జర్వర్ బాబు

పార్వతీపురం: ఓటర్ల జాబితా తయారీలో బీఎల్ఓలదే కీలక పాత్ర అని ఓటరు జాబితా పరిశీలకులు ఎ.బాబు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఆయన బుధవారం పర్యటించారు. కలెక్టర్ కార్యాలయంలో ఓటరు నమోదు అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులతో సమీక్షించారు. ఓటరు జాబితా తయారీలో బీఎల్ఓలు కీలకంగా వ్యవహరించాలని కోరారు. సక్రమంగా పనిచేయని బీఎల్ఓలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. చేర్పులు, మార్పులు, తొలగింపుల అంశంలో బీఎల్ఓల పరిశీలన పక్కాగా ఉండాలన్నారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించి తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. పాలకొండ నియోజకవర్గం పోలింగ్ కేంద్రం 47, కురుపాం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం 24, పార్వతీపురం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం 10, సాలూరు నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం 27 పరిధిలోని బీఎల్ఓల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శాసన మండలి ఎన్నికల ఓటర్లుగా అనర్హుల దరఖాస్తులను పరిశీలనలోకి తీసుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీచేసిందన్నారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా రూపకల్పనకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఫారం-6లు 12,929, ఫారం-9లు 792 అందాయన్నారు. సమావేశంలో జేసీ ఆనంద్, డీఆర్వో వెంకటరావు, ఓటరు నమోదు అధికారులు బి.నవ్య, నూరుల్‌కమర్, కె.హేమలత, సహాయ ఓటరు నమోదు అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు 40 ఏళ్ల పొలిటికల్ ఇండస్ట్రీ ఇదేనా?



పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- ఇరుకు రోడ్లలో సభలు నిర్వహించి అమాయకులను పొట్టనపెట్టుకుంటున్నారు..
- మహిళలు, యువత, రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే..
- డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: తన ప్రచార ఆర్భాటానికి 40 మంది అమాయక ప్రజలను పొట్టన పెట్టుకోవడమే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర అని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర విమర్శించారు. సాలూరు మండలం బాగువలస గ్రామంలో బుధవారం చేపట్టిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు 2014 ఎన్నిక ల్లో మోసపూరిత హామీలతో అధికారం చేపట్టి ప్రజ లకు ఆవేదన మిగిల్చారన్నారు. రుణాలు మాఫీ చేయకుండా డ్వాక్రా మహిళలు, రైతులను మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కూడా సక్రమంగా చెల్లించలేదన్నారు. అందుకే.. 2019 ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు గట్టిగా బుద్ధిచెప్పారన్నారు. 2024లో జరగనున్న సాధారణ ఎన్నికల్లోనూ అవే ఫలితాలు పునరావృతమవుతా యని తెలిపారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. మ్యానిఫెస్టోలో పొందుపరిచి న హామీలు 98 శాతానికి పైబడి అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా పేరుపొందారని చెప్పారు. అందుకే... ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు సాదరంగా ఆహ్వానిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ అండగా ఉంటామంటూ స్పష్టం చేస్తున్నారన్నారు.

మన్యం మార్కెట్‌లో
రామఫలాలు

- ఆశాజనకంగా దిగుబడి
- గుత్తుల లెక్కన విక్రయం
- ఒక్కోగుత్తుకు 20 నుంచి 40 వరకు ఫలాలు
- రూ.70 నుంచి రూ.100 మధ్య సైజును బట్టి విక్రయాలు
- సీతంపేట ఏజెన్సీలో సుమారు 50 ఎకరాల వరకు సాగు



సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో రామఫలాల సీజన్ ఆరంభమైంది. సంతలు, మార్కెట్‌ను పంట ముంచెత్తుతోంది. ప్రస్తుతం రామఫలాలకు మంచి గిరాకీ ఉంది. గుత్తుల లెక్కన రామఫలాలను గిరిజనులు విక్రయిస్తున్నారు. ఒక్కో గుత్తిలో 20 నుంచి 40 వరకు రామఫలాలుండగా రూ.70 నుంచి రూ.100 మధ్యన గిరిజనులు అమ్మకాలు జరుపుతున్నారు. వచ్చేనెల వరకు రామఫలాల సీజన్ ఉంటుంది. రామానగరం, దేవనాపురం గూడలు, అక్కన్నగూడ, రాజన్నగూడ, మొగదార, కారెం కొత్తగూడ తదితర గ్రామాల గిరిజనులు ప్రతి సోమవారం సీతంపేటలో జరిగే సంతలో పండ్లను విక్రయిస్తున్నారు. అలాగే, కుశిమి, కోడిశ, శంబాం ప్రాంత వాసులు కుశిమి సంతకు(శనివారం), మర్రిపాడు, పూతికవలస, చిన్నబగ్గ, కీసరజోడు పంచాయతీల గిరిజనులు మర్రిపాడు (బుధవారం)సంతకు, పొల్ల, టిటుకుపాయి గిరిజనులు దోనుబాయి(గురువారం) సంతకు పంటను తరలిస్తున్నారు. మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సంతకు వచ్చి రామఫలాలు కొనుగోలు చేస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో ఒక్కో గుత్తి రామ ఫలాలు రూ.200ల వరకు ధర పలుకుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. సీతంపేట మండల కొండపోడులో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో చెట్లు విస్తరించి ఉన్నాయి.

సేకరణ కష్టమే



కొండపోడు వ్యవసాయంలో పండే రామఫలాల సేకరణ కష్టమే. పండ్లు నిల్వ ఉండవు. మైదాన ప్రాంత వ్యాపారులు నిర్ణయించిన ధరలకు పంటను విక్రయిస్తున్నాం. సీజన్‌లో పంట దిగుబడులు బాగున్నాయి.
– ఎస్.మోజేషు, జోగినాయుడుగూడ

అదనపు ఆదాయం



సీతాఫలాలు తర్వాత సాధారణంగా వచ్చే పంట రామఫలాల చెట్లు కొండపోడులో అక్కడక్కడ ఉంటాయి. వ్యవసాయ పనులు చేసుకుంటూనే సీజన్‌లో సేకరిస్తాం. సేకరించిన వాటిని సంతలకు తెచ్చి విక్రయిస్తాం. తద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది.
– సవర సావిత్రి, కుశిమిగూడ



కొనుగోలు చేసిన రామఫలాలు వ్యాన్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

స్త్రీనిధి రుణ లక్ష్యం రూ.199.41 కోట్లు

బొబ్బిలి రూరల్: జిల్లాలో స్త్రీనిధి రుణ లక్ష్యం 39,882 మంది సభ్యులకు రూ.199.41కోట్లు కాగా, ఇప్పటి వరకు 39,099 మందికి రూ.169.70 కోట్ల రుణం అందించామని స్త్రీనిధి ఏజీఎం ఎ.ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో విలేకరులతో ఏజీఎం బుధవారం మాట్లాడారు. జిల్లాలో రుణాల రికవరీ 98 శాతం ఉందని, సంఘంలో 10 మంది సభ్యులు ఉంటే ఐదుగురికి రూ.4 లక్షలు, 10 మంది కంటే ఎక్కువ సభ్యులు ఉంటే ఏడుగురికి రూ.4.5 లక్షల రుణం మంజూరు చేస్తున్నామని చెప్పారు. గతంలో ఏ-గ్రేడ్ సంఘానికి రూ.50లక్షల రుణపరిమితిని రూ. 75లక్షలకు, బీ-గ్రేడ్ సంఘానికి రూ.40 లక్షల నుంచి రూ.65 లక్షలకు, సీ గ్రేడ్ సంఘానికి రూ.30 లక్షల నుంచి రూ. 55 లక్షలు, డీ గ్రేడ్ సంఘానికి రూ.20 లక్షల నుంచి రూ.45 లక్షలకు పెంచామన్నారు. ప్రతీ రుణానికి ఇన్సూరెన్స్ సదుపాయం ఉంటుందన్నారు. స్త్రీనిధి రుణాలకు వడ్డీ 11శాతం కాగా, రూ.10వేల రుణం 12 వాయిదాలు, రూ.లక్ష నుంచి రూ.50వేలు 24 వాయిదాలు, రూ.50వేల పైబడి రుణం 36 వాయిదాలలో చెల్లించాలని స్పష్టంచేశారు.

పేదలకు సొంతింటి భాగ్యం



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పేదలకు సొంతింటి భాగ్యం కల్పించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. చీపురుపల్లి పట్టణంలోని ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీలోని సచివాలయం-1 పరిధిలో గల 17, 18, 19, 20 వార్డులకు చెందిన 95 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు స్థలంతో పాటు పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. అర్హత ఉండి ఇంటి స్థలం, ఇల్లులేని లబ్ధిదారులు ఉంటే తక్షణమే గ్రామ వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, బెల్లాన వంశీకృష్ణ, మంగళగిరి శ్రీను, ఇప్పిలి తిరుమల, గిరడ రామదాసు, కొసిరెడ్డి రమణ, మండల ఆది, మహేష్, శంకర్, దబ్బాడ జగన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం:



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

జిల్లాలో పరిశ్రమలు స్థాపించడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఆ దిశగా జిల్లా పారిశ్రామిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ కోరారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలన్నారు. పారిశ్రామికవాడలకు కావలసిన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా గుండా వెళ్తున్న జాతీయ రహదారి పారిశ్రామిక ఉత్పత్తుల తరలింపునకు దోహదపడుతుందన్నారు. ప్రతీ మండలం నుంచి 30 స్వయం సహాయక సంఘాలు పారిశ్రామిక యూనిట్లు స్థాపించేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాం మాట్లాడుతూ ఇప్పటివరకు సింగిల్ డెస్క్ పోర్టల్‌లో కేవలం ఐదు దరఖాస్తులే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధి పాలసీ, వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకాల్లో భాగంగా స్టార్టప్ ఇండియా పథకం కింద సీతానగరం మండలం బూర్జ గ్రామానికి చెందిన దళిత మహిళ ఎస్.యశోదమ్మకు బియ్యంమిల్లు మంజూరైందని, బి.ప్రమీలకు చెందిన రైస్ మిల్లుకు పారిశ్రామిక సబ్సిడీ మంజూరైనట్టు వెల్లడించారు. జిల్లాలో వివిధ మండలాలకు చెందిన 12 రైస్ మిల్లర్లు సార్టెక్స్ మిషన్ల రుణంకోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీటిని బ్యాంకులకు పంపించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీపీ పథకం కింద 45 యూనిట్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు. పారిశ్రామిక పార్కులకు సీతంపేట మండలం పనుకువలసలో 30 ఎకరాలు, పాచిపెంట మండలంలో 2,398 ఎకరాలు గుర్తించామన్నారు. పాచిపెంట మండలంలో 465 ఎకరాల స్థలం అనువుగా ఉందని ఏపీఐఐసీ తెలియజేసిందని చెప్పారు. పార్వతీపురం మండలం నాగూరులో బియ్యం మిల్లులు, కురుపాం మండలం లేవిడి గ్రామంలో చింతపండు క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. బంగారు ఆభరణాల తయారీ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా రవాణా అధికారి ఎం.శశికుమార్, జిల్లా ఉద్యాన అధికారి కేవీఎస్ఎన్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, లీడ్ బ్యాంకు అసోసియేట్ కె.మౌనిక, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుధాకరరావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ని ఆవిష్కరించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) పట్టణ కమిటీ రూపొందించిన క్యాలెండర్ – 2023ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఉద్యోగుల సహకారం ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పట్టణ శాఖ కార్యదర్శి చింతల వెంకట సతీష్, జిల్లా కార్యదర్శులు కంది వెంకటరమణ, అసోసియేట్ ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాసరావు, కోశాధికారి వై.శంకరరావు, పట్టణ ఉపాధ్యక్షులు బి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు సత్యానంద్, వైఆర్ అనిల్, కె.పెంటం నాయుడు, ఎం.సత్యనారాయణ, కె.ధనుంజయ్‌కుమార్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న రూరల్ ఎస్‌ఐ

సాలూరు: మండలంలోని శివరాంపురం గ్రామంలో ఓ వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్‌ఐ ప్రయోగమూర్తి బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామంలో అక్రమంగా బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న రమణను అదుపులోకి తీసుకుని, 35 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని అన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



మృతి చెందిన రాంబాబు

పార్వతీపురం: రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పార్వతీపురం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రాంబాబు(25) కొందరితో కలిసి కొమరాడ మండలం చినఖేర్జల గ్రామంలో పొలంలో కంచె వేయడానికి పనికి వచ్చాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బుధవారం ఉదయం రాయగడ నుంచి వస్తున్న బొకోరా ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో ఎక్కాడు. రద్దీ ఎక్కువ ఉండడంతో రైలు బోగీ మెట్ల దగ్గర నిలబడి ప్రయాణిస్తుండగా మరిపివలస గ్రామం రైల్వే గేటు వద్ద ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. విజయనగరం జిల్లా ఎస్‌ఐ రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డెంగీతో గురుకులం విద్యార్థిని మృతి

వంగర: మద్దువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని మజ్జి రుతిక డెంగీతో బుధవారం మృతి చెందినట్లు ప్రిన్సిపాల్ పట్టా పద్మావతి తెలిపారు. విద్యార్థి అనారోగ్యానికి గురికావడంతో డిసెంబరు 5న తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామం వంగర మండలం శ్రీహరిపురానికి వెళ్లినట్లు చెప్పారు. జ్వరం అధికం కావడంతో రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రేగిడి: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు అన్నారు. మండలంలోని ఉంగరాడ, అప్పాపురం, మజ్జిరాముడుపేట, ఉంగరాడమెట్ట తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు బుధవారం ఆరోగ్య పరీక్షలు చేశారు. చలితీవ్రత అధికంగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు.

ఏజెన్సీ గజగజ



తివ్వాకొండల్లో పరుచుకొన్న మంచు తెరలు



నెగడు మంట ముందు బొడ్డగూడ ఆదివాసీలు

- పెరిగిన చలి
- ఏకధాటిగా కురుస్తున్న మంచు
- చలి మంటలతో ఆదివాసీల ఊరట

ఏజెన్సీలో చలి పులి పంజా విసురుతోంది. సంక్రాంతి దగ్గర పడుతున్న వేళ చలి మరింత పెరిగి ఏజెన్సీ వాసులను గజగజ వణికిస్తోంది. చలి నుంచి బయటపడేందుకు గిరిజనులు నానా తంటాలు పడుతున్నారు.

భామిని: ఏజెన్సీ చలితో వణుకుతోంది. ఉష్ణోగ్రతలు తగ్గడంతో ప్రజలు చలితో వణికిపోతున్నారు. చలికి తోడు తీవ్రంగా మంచు కురుస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏజెన్సీలో బుధవారం 13 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఇదే పరిస్థితి సంక్రాంతి వరకు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు స్పష్టం చేయడంతో ఏజెన్సీ వాసులు ఆందోళన చెందుతున్నారు. పగటి పూట మంచు తెరలు వీడిన తరువాత రోజు వారీ కార్యకలాపాలు ప్రారంభమయ్యే సరికి ఆలస్యమవుతోంది. ఇక రోజూ సాయంత్రం ఐదు గంటలకే మంచు కురవడం ప్రారంభమై వాతావరణం మరింత చల్లబడుతోంది. ఉదయం తొమ్మిది గంటల వరకు సూర్యుడి దర్శనం కరువవుతోంది. దీని ప్రభావంతో కొండకోనల్లో... రహదారులపై ప్రయాణానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తివ్వా కొండ ప్రాంతంలో మంచు విస్తారంగా పరుచుకోవడంతో కొండలన్నీ మంచు దుప్పటి కప్పుకుంటున్నాయి. రోడ్లన్నీ పొగ మంచుతో దర్శనమిస్తున్నాయి.

ఆదివాసీల అవస్థలు

చలి ప్రభావంతో ఆదివాసీలు రక్షణ పొందేందుకు రకరకాల మార్గాలు వెతుకుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలు రాత్రంతా నెగడుల వేడితో ఉపశమనం పొందుతున్నారు. వృద్ధులు, పిల్లలు, చలి మంటలతో ఉపశమనం పొందుతున్నారు. సంక్రాంతి ముందు ఇంటి పనుల్లో తలమునకలైన మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

పొంచి ఉన్న అనారోగ్య సమస్యలు..

చలి పులి దాడిలో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. గొంతు, ముక్కు వ్యాధులు తీవ్రమవుతున్నాయి. ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధులు, క్షయ వ్యాధిగ్రస్తులు విజృంభిస్తున్నాయి. వాహనదారులకు ప్రయాణ కష్టాలు, అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

తస్మాత్...



చలి తీవ్రతతో అనారోగ్య సమస్యలు పెరుగుతాయి. ఆస్తా్మ, ఉబ్బసం, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులకు అవస్థలు పెరగనున్నాయి. చలితో శర్మం పాలుసు బారి చర్మవ్యాధులు పెరగవచ్చు. గతంలో టీబీ ఉన్న బాధితులు అప్రమత్తంగా ఉండాలి. చలి నుంచిరక్షణ చర్యలు చేపట్టాలి. వేడి వాతావరణంలో ఉండాలి. ఉలెన్ దుస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి.శనీరు ఎక్కువగా తాగుతుండాలి. వేడి వేడి ఆహారం, పానీయాలు తీసుకోవాలి.

– డాక్టర్ కె.విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

సత్తా చాటిన ఆంధ్రా బ్యాట్స్‌మెన్

- ఆఫ్ సెంచరీలతో రాణించిన కెఎస్.భరత్, జ్ఞానేశ్వర్
- మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత చాటుకున్న హైదరాబాద్



ఆంధ్రా – హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతున్న రంజీ మ్యాచ్



రెండవ ఇన్నింగ్స్‌లో 52 బంతుల్లో 70 పరుగులతో నాటౌట్ నిలిచిన ఆంధ్రా బ్యాట్స్‌మెన్ భరత్



రెండవ ఇన్నింగ్స్‌లో 72 పరుగులు సాధించిన జ్ఞానేశ్వర్

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న రంజీ క్రికెట్ మ్యాచ్‌లో రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్‌లో ఆంధ్రా జట్టు బ్యాట్స్‌మెన్స్ సత్తా చాటారు. కెఎస్.భరత్, జ్ఞానేశ్వర్ ఆఫ్ సెంచరీలతో రాణించటంతో రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు నష్టపోయి 230 జోడించింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఆంధ్రా – హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ రెండవ రోజు బుధవారం కొనసాగింది. 30 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 79 పరుగులు నష్టానికి మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు మొత్తం 63.1 ఓవర్లలో 197కు ఆలౌటైంది. జట్టు బ్యాటింగ్‌లో శశాంక్ 47 పరుగులు, తన్మయ్‌అగర్వాల్ 35 పరుగులతో రాణించారు. ఆంధ్రా జట్టు బౌలింగ్‌లో కె.నితీష్‌కుమార్‌రెడ్డి 4 వికెట్లు, కెవి.శశికాంత్ 3 వికెట్లు చేజిక్కించుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 48 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 230 పరుగులు జోడించారు. జట్టు బ్యాటింగ్‌లో కెఎస్.భరత్ 52 బంతుల్లో 70 పరుగులతో నాటౌట్‌గా కొనసాగుతుండగా.... సిహెచ్.జ్ఞానేశ్వరావు 96 బంతుల్లో 72 పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో హైదరాబాద్ క్రీడాకారుడు రక్షణ్ 18 ఓవర్లలో 3 వికెట్లు కైవసం చేసుకున్నాడు. అంతకు ముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు 135 పరుగులకే ఆలౌటైన విషయం విదితమే.

పాన్ షాప్ దగ్ధం



మంటల్లో కాలి బూడిదైన పాన్ షాప్

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో విజయనగరం – పాలకొండ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పాన్ షాప్ దగ్ధమైంది. మంగళవారం రాత్రి వరకు కొనసాగిన ఈ దుకాణం బుధవారం తెల్లవారే సరికి కాలి బూడిదైంది. దీంతో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు లబోదిబో మంటున్నారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలు... గరివిడి మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన ఇ.పార్వతి బతుకు తెరువు కోసం పాన్ షాప్‌తో పాటు టీ దుకాణం నడుపుకుంటుంది. ప్రతీరోజూ మాదిరిగానే మంగళవారం కూడా దుకాణం మూసుకుని ఇంటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం వచ్చి చూసే సరికి దుకాణం మంటల్లో కాలి బూడిదైనట్లు పార్వతి వివరించింది. ఈ ప్రమాదంలో పాన్ షాప్‌లో ఉన్న వస్తువులతో పాటు ఫ్రిజ్, గ్యాస్ పొయ్యి, ఇతర సామగ్రి కాలిపోయిందని రూ.లక్ష వరకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే కొద్ది కాలం క్రితం తన దుకాణాన్ని తొలగించాలని లేకపోతే ఇబ్బందులు ఎదుర్కొంటారని వంగపల్లిపేట గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు తనను బెదిరించినట్లు ఆమె తెలిపింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించింది.



పొలాల్లో కాలిపోతున్న వరిచేను కుప్పలు

వరిచేను కుప్పలు దగ్ధం

సంతకవిటి : మండలంలో ఎమ్ఆర్ అగ్రహారం పంట పొలాల్లో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. పంట పొలాల్లో వరి నూర్పిడి చేసేందుకు సిద్ధంగా ఉంచిన వావిలపల్లి రమణమ్మ, వావిలపల్లి శ్రీనివాసరావులకు చెందిన రెండెకరాల వరిచేను కుప్పలకు నిప్పు అంటుకుంది. వీటితో పాటు పక్కనే విక్రయానికి సిద్ధం చేసి ఉంచిన 20 బస్తాల ధాన్యం కూడా కాలిపోయింది. మంటలు వ్యాప్తి చెందిన వెంటనే రైతులు గుర్తించి అదుపుచేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కనిపించలేదు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పంచాయతీ సర్పంచ్ దాసరి దాలినాయుడు సమాచారాన్ని తహసీల్దార్ ఎ.సులోచనారాణికి అందజేశారు. వీఆర్‌ఏ సరస్వతి ప్రమాద స్థలానికి చేరుకుని పంట నష్టంపై పరిశీలన చేశారు. రూ. 1.50 లక్షల మేర ఆస్తినష్టం ఉంటుందని ప్రాథమిక నిర్ధారణ చేశారు. ఇదిలా ఉండగా చేతికందిన పంట నష్టపోవడంతో బాధితులు లబోదిబోమంటూ విలపిస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

స్కూల్ గేమ్స్ పోటీల్లో కస్పా విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన కస్పా ఉన్నత పాఠశాల విద్యార్థులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. గత నెల 26 నుంచి 28వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగిన పోటీల్లో ఎ.రిచితారెడ్డి, ఎ.చందూ, పి.సాయి తారక్‌హర్ష, పి.హిమశ్రీలు బంగారు పతకాలు కైవసం చేసుకోగా.. కెఆర్.సత్య వెండి పతకం, పి.సాయి చైతన్య కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పతకాలు సాధించిన పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఆర్.శంకరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, సాధామణి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కొట్లాటలో ముగ్గురికి గాయాలు

గజపతినగరం రూరల్: భూమి తగాదాలో ఇరువర్గాల మధ్య కొట్లాట జరగడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు గజపతినగరం ఎస్‌ఐ గంగరాజు బుధవారం తెలిపారు. మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన కుమిలి సూరితో పాటు ఐదుగురు అన్నదమ్ములు గడిచిన కొంత కాలంగా తల్లిదండ్రులు నుంచి వచ్చిన భూములను పంచుకునేందుకు గ్రామ పెద్దలు వద్ద పంచాయితీలో ఒప్పందం కుదుర్చుకున్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు మిగతా అన్నదమ్ములు సూరి, ఆయన పిల్లలను రావాలని కోరగా వారు భూములు నాపేరున ఉన్నాయని, నేను రావాల్సిన అవసరం లేదని చెబుతూ పలుమార్లు నిరాకరించడంతో మాటమాట పెరిగి తగాదాకు దారి తీసిందని తెలిపారు. ఈ తగాదాలో ముగ్గురికి గాయాలవ్వడంతో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. ఇరు వర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా

- ఎస్‌ఐతో వాగ్వాదం– ఉద్రిక్తత



సంతకవిటి పోలీస్‌స్టేషన్ వద్ద బిళ్లాణి గ్రామస్తుల ఆందోళన

సంతకవిటి : బిళ్లాణి గ్రామస్తులు సంతకవిటి పోలీస్ స్టేషన్ ముందు బుధవారం ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. బిళ్లాణి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కంచర్ల అనిత భర్త కంచర్ల ధనుంజయరావును ఎస్‌ఐ జనార్దనరావు కొట్టారని ఆరోపిస్తూ గ్రామస్తులు ధర్నాకు దిగారు. కంచర్ల ధనుంజయరావుకు, ఇజ్జిపేట గ్రామానికి చెందిన చిక్కాల కాశీబాబుకు మధ్య పంట పొలాలకు నీరందించే విషయంలో కొద్ది రోజులుగా వివాదం నెలకొంది. ఈ విషయం గ్రామ పెద్దల వద్ద ఉండగానే రెండు రోజుల కిందట కాశీబాబు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ జనార్దనరావు ఇరు వర్గాలను పిలిచి సమస్యపై ఆరా తీశారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం కూడా ధనుంజయరావును స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తుండగా వివాదం రేగింది. ఈ సమయంలో ఎస్‌ఐకి, ధనుంజయరావుకు మధ్య వాగ్వాదం పెద్దది కావడంతో ధనుంజయరావుపై ఎస్‌ఐ చేయి చేసుకున్నట్టు బాధిత కుటుంబీకులు ఆరోపిస్తున్నారని రాజాం పట్టణ సీఐ కె.రవికుమార్, రూరల్ సీఐ ఉపేంద్ర తెలిపారు. ఈ వివాదం నేపథ్యంలో విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంగళవారం రాత్రి స్టేషన్ వద్ద నిరసనకు సిద్ధమయ్యారు. బుధవారం ఉదయం ఏడు గంటల సమయానికి మళ్లీ స్టేషన్‌కు వెళ్లి ముందు బైఠాయించారు. ఎస్‌ఐకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో సీఐలు రవికుమార్, ఉపేంద్ర తదితరులు స్టేషన్‌కు చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వివాదం విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సంతకవిటి చేరుకొని బాధిత కుటుంబీకులు, సీఐలతో మాట్లాడారు. ఘటనపై ఆరా తీశారు. రాజాం ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న ధనుంజయరావును పరామర్శించారు. ఎస్‌ఐపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేలా చేస్తామని శాంతించాలని సూచించారు. దీంతో గ్రామస్తులు నిరసన విరమించి వెనుదిరిగారు.

సబ్‌జైలును సందర్శించిన డీఐజీ



జైళ్ల శాఖ డీఐజీతో జైలు సూపరింటెండెంట్ పాత్రో

బొబ్బిలి:

పట్టణంలోని సబ్ జైలును జైళ్ల శాఖ రాజమండ్రి జోన్ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ఫైళ్లను పరిశీలించారు. సబ్‌జైలులో ఎంత మంది రిమాండ్ ఖైదీలున్నారు, వారి ప్రవర్తన, అందజేస్తున్న ఆహారం తదితర విషయాలను తెలుసుకున్నారు. ఆయనతో పాటు సబ్‌జైల్ సూపరింటెండెంట్ పాత్రో ఉన్నారు.

వంతెన నిర్మాణానికి వడివడిగా అడుగులు



వాల్తేరు వద్ద భూసార పరీక్ష చేస్తున్న అధికారులు

సంతకవిటి: మండలంలోని వాల్తేరు గ్రామం వద్ద నాగావళి నదిపై బలసలరేవు నుంచి ఆమదాలవలస మండలం ఇసుకలపేట వరకు వంతెన నిర్మాణానికి చర్యలు ముమ్మరమయ్యాయి. నదిపై వంతెన నిర్మాణానికి సంబంధించి ఖర్చు అంచనా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిన్నర కిందట ప్రీ ఎస్టిమేట్ సర్వే చేసింది. ఎక్కడ నుంచి ఎక్కడి వరకు వంతెన నిర్మించాలి.. ఎంత ఎత్తులో వంతెన నిర్మించాలి.. రహదారి సౌకర్యం, భవిష్యత్ వినియోగం తదితర అంశాలపై అంచనాలు వేశారు. అందుకు తగ్గట్టుగా వంతెన నిర్మాణానికి రూ. 87 కోట్లు కావాల్సి ఉందని ఆర్అండ్‌బీ అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపింది. 600 మీటర్ల పొడవునా వంతెన నిర్మించేందుకు ఏర్పాటు చేయగా, నాలుగు రోజుల కిందట ఇసుకలపేట వద్ద సాయిల్ టెస్టులు నిర్వహించారు. రెండు రోజులుగా వాల్తేరు వైపు భూసార పరీక్షలు చేస్తున్నట్టు ఆర్అండ్‌బీ జేఈ నాయక్ వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



ప్రవీణ్ మృతదేహం

విజయనగరం క్రైమ్: అనుమానాస్పద రీతిలో యువకుడు మృతి చెందిన సంఘటన జమ్ము నారాయణపురం సమీపంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గొడవీధికి చెందిన ప్రవీణ్ కుమార్ (23) ఓ థియేటర్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 3న ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు తమకు కొంత మందిపై అనుమానం ఉందంటూ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి నలుగురు వ్యక్తులను విచారించారు. స్టేడియం పేట సమీపంలో ఈవెంట్స్ డెకరేషన్ షాపు వద్ద మద్యం సేవించినట్లు, తమ మొబైల్ ఫోన్ ప్రవీణ్ బైక్‌లో ఉండడంతో అతనే దొంగలించాడనుకుని తిట్టి, మందలించి అందరూ వచ్చి రూంలో పడుకున్నట్లు, ఉదయం లేచి చూసేసరికి ఆ వ్యక్తి కనబడకపోయేసరికి, అతని బైక్, ఫోన్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు విచారణలో పేర్కొన్నారని తెలిపారు. ఇదిలా ఉంటే బుధవారం జమ్ము నారాయణపురం సమీపంలో ఉన్న చెరువు పక్కన ఉన్న బావిలో ప్రవీణ్ శవమై తేలి ఉన్నట్లు అందుకున్న సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామన్నారు. మనస్తాపం చెంది మృతి చెందాడా? ఎవరైనా కొట్టి చంపేసి, ఊరి చివర బావిలో పడేశారా? అనే కోణంలో విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా పెదపోలమాంబ అనుపోత్సవం



పెద్ద అమ్మవారు ఘటాల ఊరేగింపు



కోలాటం ఆడుతున్న మహిళలు

మక్కువ: శంబర పోలమాంబ మేనత్తైన పెద్దపోలమాంబ అమ్మవారు అనుపోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, కమిటీ సభ్యులు, ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్‌లు, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో అనుపోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం అమ్మవారిని గ్రామానికి చెందిన గిరడవారి, నాయుడువారి(పూడి), కర్ణాలు (కుప్పిలి)వాళ్ల ఇళ్ల వద్ద ఉత్సవం జరిపి అన్ని పుర వీధులలో తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఉదయం 9గంటల వరకు అమ్మవారు ఘటాలనూ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి, అనంతరం గ్రామంలోని ప్రధాన రహదారి వద్ద అమ్మవారికి ఉయ్యాలు కంబాలు ఉత్సవాలు జరిపించి అనంతరం అమ్మవారు ఘటాలను అనుపోత్సవం నిర్వహించారు. నూతన వస్త్రాలపై చిన్న పిల్లలను పడుకుంటబెట్టగా, వారిపై నుంచి అమ్మవారి ఘటాలు దాటుకుంటూ వెళ్లాయి. కోలాటం, తప్పెడుగుళ్లతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనుపోత్సవం కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ఘటాలకు పూజలు చేశారు.